
సాక్షి
ఒడిశా

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,84,646లు, బంగారం 2.85 గ్రాములు, వెండి 15.8 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ముగిసిన చైత్రోత్సవం

- 8లో



కస్టడీలో యువకుడి మృతి

- బాధితులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని హైకోర్టు ఆదేశం

- 8లో

న్యూస్‌రీల్

ఘనంగా ముగిసిన రకురాణి ఘటయాత్ర



నవరంగ్‌పూర్‌లో బుడి ఠకురాణి ఘటాలు

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని బుడి ఠకురాణి అమ్మవారి ఘటయాత్ర ఘనంగా ముగిసింది. బుధవారం వేకువజామున పుర వీధుల్లో అమ్మవారి ఘటాలు యాత్ర ముగించాయి. గత 9రోజులుగా ఈ ఘటాలు ఊరేగింపు జరుగుతుండగా.. రోజూ కొన్ని ప్రాంతాల్లో భక్తుల పూజలందుకుండేవారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు పూర్తి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఘనస్వాగతం పలికారు. పసుపు నీళ్లతో వీధులను శుభ్రం చేశారు. పెద్ద ఎత్తున్న మొక్కుబడులు చెల్లించారు. పూర్తి గిరిజన సంప్రదాయంతో యాత్ర ముగిసింది.

దిగాపూర్‌లో వైభవంగా పూజలు



పూజలందుకుంటున్న మాబుడి ఠకురాణి

జయపురం: కొట్‌పాడ్ సమితి దిగాపూర్ గ్రామంలో ప్రజలు తరతరాలుగా ఆరాదిస్తున్న మాబుడి ఠకురాణి వార్షికయాత్ర మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా ముగిసింది. ఆదివారం ప్రారంభమైన జాతరలో వేలాదిమంది భక్తులు పాల్గొనగా.. ప్రత్యేక పూజలు జరిగాయి. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బీసీ ఆదేశాల మేరకు బొయిపరిగుడ పోలీసు అధికారి అశ్వినీ పట్నాయక్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. జాతరలో వివిధ గ్రామ దేవతల లాఠీలు పాల్గొన్నాయి.

బీఎస్‌ఎఫ్ జవాన్ల రక్తదానం



రక్తదానం చేస్తున్న బీఎస్‌ఎఫ్ జవాన్లు

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని ఎస్‌ఓజీ శిక్షణా కేంద్రంలో 125మంది బీఎస్‌ఎఫ్ జవాన్లు బుధవారం రక్తదానం చేశారు. 180వ బెటాలియన్ దళం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కమాండర్ సంజయ్‌దాస్ శిబిరాన్ని ప్రారంభించి, స్వయంగా రక్తదానం చేసారు. కొరాపుట్ బ్లడ్ బ్యాంక్ అధికారి ఫకీర్‌చరణ్ ముండా, డాక్టర్ బలియార్ సింగ్, కొరాపుట్ బ్లడ్ డోనర్స్ ఫెడరేషన్ జిల్లాశాఖ కన్వీనర్ చిత్తరంజన్ మిశ్రా, కార్యదర్శి స్నిగ్ధారాణి మిశ్రా, ప్రదీప్‌కుమార్ త్రిపాఠి హాజరయ్యారు.

పిడుగుపాటుకు 14 గొర్రెలు మృతి



మృతిచెంది ఉన్న గొర్రెలు

బరంపురం: గంజాం జిల్లా మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇదో సమయంలో పిడుగుపాటుకు 14గొర్రెలు, ఆవు దూడ మృతిచెందాయి. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని సన్నొఖెముండి బ్లాక్ పరిధి గౌతమి గ్రామానికి చెందిన శంకర్ పాత్రొ తన గొర్రెలు, ఆవులను పొలం సమీపంలో మేతకు వదిలి, పని చేసుకుంటున్నాడు. సాయంత్రం 4గంటల సమయంలో వర్షంతో పాటు పిడుగులు పడటంతో 14 గొర్రెలు, లేగదూడ మృతిచెందాయి. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని పంచాయతీ సర్పంచ్, గ్రామస్తులు అధికారులను కోరారు.



శాంతమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



ఊరేంగింపులో అఖండ దీపం



సంబరాల్లో కిక్కిరిసిన భక్తజనం

- లాంఛనంగా ప్రారంభమైన మాబుడి శాంతమ్మ సంబరాలు
- దేశిబెహరా వీధిలో ప్రారంభ పూజలు నిర్వహించిన పాత్రర్ల దంపతులు
- ఉత్సవాలను తిలకించేందుకు పోటెత్తిన భక్తజనం

కన్నవారింటికి.. కరుణామూర్తి



ఆకట్టుకుంటున్న వేషధారణలు

బరంపురం: రాష్ట్రప్రభుత్వ అధికార ఉత్సవాలుగా గుర్తింపు పొందిన బరంపురం గ్రామదేవత మాబుడి శాంతమ్మ సంబరాలు మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగతా అమ్మవారు పుట్టింటికి చేరుకున్నారు. నగరంలోని దేశిబెహరా వీధిలో ఉన్న తాత్కాలిక మందిరం ప్రాంగణంలో సంబరాల నిర్వహకులు పాతర్ల దుర్గాప్రసాద్ దేశిబెహరా సారధ్యంలో వేద పండితులు వేమగోటి వాసుదేవ్‌శాస్త్రి నిర్ణయించిన ముహర్తం ప్రకారం పురోహితుల వేదమంత్రాలు, మంగళ వాయిధ్యాల నడుమ శాంతమ్మ ఆలయానికి చేరుకున్నారు. శతాబ్దాల సంప్రదాయాల అనుసారంగా దేశిబెహరా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన గుగ్గిలం ధూపారాదనతో కొలిచారు. ఆలయ పూజర్లు ప్రత్యేక మంత్రోశ్చారతో శాంతమ్మను ఆహ్వానించారు. అనంతరం అమ్మవారి తలపై నుంచి కనకాంబరాల పూలదండ జంగిడిలో పడటంతో అనుగ్రహించినట్లు భావించారు. ఈ మేరకు దేశిబెహరా సతీమణి పాతర్ల దేవకీ తలపై జంగిడితో ఆలయం వెలుపలికి చేరుకొని, ప్రాంగణంలో ప్రత్యేక పూజలతో చేశారు. శాంతమ్మ తిరిగి ఆలయానికి చేరుకునే వరకు ఎటువంటి దుష్టశక్తులు లోపలికి ప్రవేశించకుండా అష్టదిగ్బంధం చేశారు. అనంతరం భారీ ఊరేగింపు మధ్య దేశిబెహరా వీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక మందిరంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. దీంతో సంబరాలు అధికారికంగా ప్రారంభించారు. బుధవారం ఉదయం మాబుడి శాంతమ్మకు ప్రత్యేక ఏకాంత సేవలు జరిపి, అనంతరం భక్తుల దర్శనాలకు అవకాశం కల్పించారు. అలాగే ఉత్సవాలకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టారు. బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ శాంతి, భద్రతలను పర్యవేక్షించారు.



సాంబ్రాణి ధూపం, అగ్ని కీలలతో అమ్మవారికి స్వాగతం పలుకుతున్న భక్తులు



ఊరేగింపుగా పుట్టింటికి చేరుకుంటున్న అమ్మవారు



శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సరవణ్ వివేక్

పర్లాకిమిడిలో ఉత్సవాలు ప్రారంభం



కూడలిలో దండకాళికి పూజలు

పర్లాకిమిడి: పట్టణంలో చైత్రమాస ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలుగు సొండివీధి వద్ద బలుంకేశ్వర్ మా దండకాళి ఉత్సవాలు చేపట్టగా.. పలు కూడళ్లలో ఊరేగింపు, గాలి, ధూళి దండొనాచొ భక్తులు వినూత్న పద్ధతులతో అమ్మవారిని పూజించారు. అంకావీధిలో మాణికేశ్వర దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 14 మేరు సంక్రాంతితో చైత్రోత్సవాలు ముగుస్తాయి. గ్రామదేవత నీలమ్మ ఉత్సవాలు మాసాంతం వరకు ఘనంగా జరిపేందుకు స్థానికులు ఉత్సాహం చూపిస్తున్నారు.

అగ్నిప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తినష్టం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పోలీస్ స్టేషన్ పరిధి పూసుగూడ పంచాయతీ పేట గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తినష్టం సంభవించింది. లచ్చ కుంజె అనే వ్యక్తి ఇంటికి నిప్పంటుకోవడంతో గమనించిన గ్రామస్తులు అదుపుల చేసుందుకు ప్రయత్నించారు. అయితే ఇంట్లోని సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది. విలువైన పత్రాలు, రూ.4 లక్షల నగదు, బంగారం, సామగ్రి, 20 క్వింటాళ్ల ధాన్యం కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్తినష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. అలాగే తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు, టార్పాలిన్ అందజేశారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

సదస్సుకు అనూహ్య స్పందన

- రాష్ట్రంలో రూ.26వేల కోట్ల పెట్టుబడులు
- ఒడిశా బిజినెస్ మీట్ టోక్యో–2023లో జపాన్ పారిశ్రామికవేత్తలు



జపాన్-ఒడిశా పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



ప్రసంగిస్తున్న సీఎం నవీన్

భువనేశ్వర్: ఒడిశా–జపాన్ సాంస్కృతిక అనుబంధం అత్యంత బలమైనదని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కొనియాడారు. టోక్యోలో బుధవారం జరిగిన ఒడిశా ఇన్వెస్టర్స్ మీట్‌లో ప్రసంగించారు. రాష్ట్రంలో అపారమైన వర్తక, వ్యాపార, పారిశ్రామిక వనరులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. జపాన్‌లో ఔత్సాహిక పెట్టుబడుదారులు ఉత్సాహంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పారిశ్రామిక పెట్టుబడులకు రాష్ట్రం కల్పిస్తున్న అవకాశాలు, ప్రగతిశీల విధానాలను వివరించారు. హిందూ మహాసముద్రం తీరవ్యాప్తంగా వర్తక వాణిజ్యాలకు రాష్ట్రం చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిందని తెలిపారు. మైనింగ్, భూగర్భ, రసాయన, ఆహార ఉత్పతుల రంగాలలో ఒడిశా ప్రగతి అంతర్జాతీయ పారిశ్రామిక పెట్టుబడుల అనుకూలతకు అద్దం పడుతుందన్నారు.

పెట్టుబడులకు ఆసక్తి..

టోక్యోలో జరిగిన ఒడిశా బిజినెస్ మీట్–2023లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ ఎనర్జీ పరికరాల తయారీ, సాంకేతిక సమాచారం, లాజిస్టిక్స్, ఉక్కు తదితర లోహ అనుబంధ రంగాల్లో రూ.26వేల కోట్ల పెట్టుబడులతో జపాన్‌కు చెందిన పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం విశేషం. ఒడిశా ప్రభుత్వం, జపాన్ లోని భారత రాయబార కార్యాలయం, జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జెట్రో), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) సహకారంతో ఒడిశా బిజినెస్ మీట్ టోక్యో–2023ను నిర్వహించింది. సీఎం నవీన్ పట్నాయక్, జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కజుయా నకాజో, రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇపికాల్, ఫిక్కీ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

సారా బట్టీలపై మహిళల దాడులు



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు, సామగ్రి

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని బొయిపరిగుడ సమితి పెన్సలాడ పంచాయతీ బొడపొడ ప్రాంతంలో సారా తయారీ బట్టీలపై మహిళా స్వయం సహాయక సంఘాలు దాడులు చేపట్టాయి. పెద్దఎత్తున సారాతో పాటు తయారీకి సిద్ధంగా ఉంచిన విప్ప ఊటను ధ్వంసం చేశారు. దీనిపై గ్రామస్తులు, పోలీసులు అందించిన సమాచారం ప్రకారం బొడొపొడ గ్రామంలోని గుప్తేశ్వర్, మాతర్ధణ, మా ధరణి, మా బండవతి స్వయం సహాయక సంఘాలకు చెందిన వందలాది మంది మహిళలు దాడుల్లో పాల్గొన్నారు. గ్రామంలో గతకొంత కాలంగా వ్యాపారులు దొంగచాటుగా సారా విక్రయాలు జరుపుతున్నారు. దీంతో పెద్దలు, పిల్లలు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనితో పాటు కుటుంబాలలో కలతలు ఏర్పడుతున్నాయని, ఇతర గ్రామాల నుంచి మందుబాబులు రావడంతో అల్లర్లు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. గత ఏడాదిలో గ్రామానికి చెందిన 8మంది సారా తాగి, మరణించారని ఆరోపించారు. గ్రామాన్ని సారారహితంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా బట్టీలపై దాడులు చేశామని వివరించారు. అలాగే సారా విక్రయాలు, తాడటం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైనత్యంవంతం చేసేలా జిల్లా కలక్టర్, ఎస్పీ సాయం కోరుతామని ఎస్‌హెచ్‌జీ మహిళలు తెలియజేశారు.



సారా బట్టీలపై దాడులు చేస్తున్న మహిళలు

ఎన్‌ఏసీ ఎన్నికల్లో బీజేడీ శంఖారావం

- అట్టబిరా, హిందోల్ చైర్‌పర్సన్ స్థానాలు కైవసం
- ఒక్క స్థానానికే పరిమితమైన కాంగ్రెస్, బీజేపీ ఖాతాలో 5వార్డులు



ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద రాజకీయ ప్రతినిధుల ఉత్కంఠ



పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

భువనేశ్వర్: బర్‌ఘడ్ జిల్లా అట్టబిరా, ఢెంకనాల్ జిల్లా హిందోల్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్(ఎన్‌ఏసి)కి జరిగిన ఎన్నికల్లో అధికార పక్షం బిజూ జనతా దళ్(బీజేడీ) అభ్యర్థులు విజయ శంఖారావం పూరించారు. ఈనెల 3న జరిగిన ఎన్నికల ఫలితాలను బుధవారం ప్రకటించారు. ఇందులో హిందోల్ ఎన్‌ఏసీలో 88 శాతం, అట్టబిరాలో 74శాతం పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. అట్టబిరా నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్‌లోని 12 వార్డుల్లో 39మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. వీటిలో 11 స్థానాలను బీజేడీ గెలుచుకోగా, కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానానికే పరిమితమైంది. కాంగ్రెస్ అభ్యర్థి దీపక్ రే వార్డు–1 నుంచి, బీజేడీకి చెందిన శివానంద త్రిపాఠి వార్డు–2, నేపాల్ ప్రధాన్ వార్డు–3, సబిత మల్లిక్ వార్డు–4, రాజీబ్ కహ్రా వార్డు–5, ప్రమీలా ప్రధాన్ వార్డు–6, బిలేష్ జజ్‌పురి వార్డు–7, రేణుకా ప్రధాన్ వార్డు–8, నారాయణ్ సాహు వార్డు–9, సురేఖ బాగ్ వార్డు–10, అనసూయ బిశ్వాల్ వార్డు–12 విజయం సాధించారు.

ఆకాంక్షలు నెరవేరుస్తాం..

చెర్‌పర్సన్ ఎన్నికలో బీజేడీ అభ్యర్థి బనమాలి బరిహా తన సమీప ప్రత్యర్థి సబితా భుయేపై 4,828 ఓట్ల తేడాతో అట్టబిరా నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకున్నారు. బరిహాకు 6,565 ఓట్లు పోలవ్వగా.. సబితా భుయేకు 1,737 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి లక్ష్మీ బెహరా 1,532 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. దీంతో అట్టబిరా మరోసారి శంఖం పార్టీ ఖాతాలోకి చేరింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే స్నేహాంగిని చురియా మాట్లాడుతూ పౌరసంస్థలో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని, ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని తెలిపారు. హిందోల్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ ఎన్నికలో 16 కౌన్సిలర్ స్థానాల కోసం 50మంది అభ్యర్థులు పోటీ చేశారు. మొత్తం 16 వార్డులలో బీజేడీ 11 వార్డులను కైవసం చేసుకుంది. మిగిలిన 5వార్డులు భారతీయ జనతా పార్టీ(బీజేపీ)కి దక్కాయి. చైర్‌పర్సన్ ఎన్నికలో బిజూ జనతాదళ్ అభ్యర్థి కేశబ్‌చంద్ర ప్రధాన్ 4,347 ఓట్లతో ఎన్నికయ్యారు, బీజేపీకి చెందిన సోవాగిని ప్రధాన్‌కు 3923 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి రీటా పాలీ 219 ఓట్లతో తదుపరి స్థానాల్లో నిలిచారు. ఈ రెండు ఎన్నికల్లో బీజేడీ క్లీన్‌స్వీప్ చేయడంతో బర్‌ఘడ్, ఢెంకనాల్ జిల్లా కేంద్రాల్లోని అధికార పార్టీ కార్యాలయాల్లో విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ విజయంతో బీజేడీ కార్యకర్తలు కొత్త ఉత్సాహంతో ఉరకలేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు ఇండియన్ నేవీ ఉద్యోగి మృతి


గోవింద్ (ఫైల్)

చీపురుపల్లి రూరల్: ఇండియన్ నేవీలో విధులు నిర్వర్తిస్తున్న చీపురుపల్లి మండలం పర్ల గ్రామానికి చెందిన చందక గోవింద్(30) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ మేరకు ఇండియన్ నేవీ అధికారుల నుంచి కుటుంబీకులకు సమాచారం అందింది. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపిన వివరాలు.. మృతుడు గోవింద్ విశాఖపట్టణం నుంచి కొల్‌కత్తాలో పారాచ్యూట్ శిక్షణ నిమిత్తం వెళ్లగా అక్కడ జరిగిన సంఘటనలో మృతి చెందినట్లు తెలిపారు. గ్రామంలో ఏడాది క్రితం తండ్రి మరణించగా ప్రభుత్వ ఉద్యోగంలో కొలువు సాధించిన గోవింద్ కుటుంబ బాధ్యతలను మోస్తున్నాడు. గోవింద్ మృతితో తల్లి లక్ష్మి గుండెలవిసేలా రోదిస్తుంది. మృతుడు గోవింద్‌కు ఒక సోదరుడు, సోదరి ఉన్నారు. గోవింద్ మృతితో గ్రామంలో విషాదం అలముకొంది. ప్రస్తుతానికి మృతదేహం కొల్‌కత్తాలో ఉందని గురువారం నాటికి మృతదేహం గ్రామానికి చేరుకోవచ్చునని గ్రామస్తులు తెలిపారు.

చెరుకు ట్రాక్టర్ బోల్తా


రాజాం రహదారిలో బోల్తా పడిన చెరుకు ట్రాక్టర్

పాలకొండ రూరల్: పాలకొండ- రాజాం రహదారిలో స్థానిక సన్‌మ్యాక్స్ థియేటర్ వద్ద బుధవారం రాత్రి చెరుకు లోడుతో రాజాం వైపు వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ క్రమంలో రాజాం, విశాఖ వైపు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఉరుములు, పిడుగులతో భారీ వర్షం


నేరడిలో కురుస్తున్న భారీ వర్షం

భామిని: మండలంలో పలుచోట్ల బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఈ వర్షం తోడవడంతో పొలాల్లో నీరు చేరింది. ఇప్పటికే దెబ్బతిన్న పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ వర్షంతో ఆరుతడి పంటలతో పాటు రబీ పంటలు కూడా దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

విజయనగరం పూల్‌బాగ్: వేసవిలో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని (ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్) ఆప్తా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చింతాడ రాము అధ్యక్షతన స్థానిక ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో బుధవారం సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.నారాయణరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చైత్రోత్సవం

- కనుల పండువగా మజ్జిగౌరి వార్షిక ఉత్సవాలు
- పూర్ణాహుతితో చండీహోమం, వేడుకలు పూర్తి


దీక్షా కార్యక్రమాలు పూర్తి చేసిన కమిటీ సభ్యులు


చండీహోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: గత 5రోజులుగా కనుల పండువగా కొనసాగిన మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాలు బుధవారం ముగిసాయి. సూర్యాపూజతో ప్రారంభమైన కార్యక్రమాలు చండీహోమం పూర్ణాహుతితో పూర్తయ్యాయి. గంజాం జిల్లా సొరడ ప్రాంతానికి చెందిన వేదపడితులు నీలమాధవ్ త్రిపాఠి బృందం చేపట్టిన పూజల్లో మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయంగా నిర్వహించిన పూజల్లో భాగంగతా ప్రపంచ శాంతి కోరుతూ నిర్వహించిన చండీహోమం ఆనవాయితీగా కొనసాగింది. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే విధంగా ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అన్ని రోజులూ మధ్యాహ్నం మందిర ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం జరిపారు. రోజూ సుమారు 3వేల మంది అన్నప్రసాదం స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు. 5రోజుల్లో కొంతమంది దాతలు స్వచ్ఛందంగా ముందువచ్చి విరాళాలు అందించారన్నారు. స్థానిక వేంకటేశ్వర, సాయిబాబా మందిరాలకు చెందిన సేవాసమితి మహిళలు సేవలు అందించారని ప్రశంసించారు.

2లక్షల మంది హాజరు..

అమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు ఒడిశా లోని వివిధ జిల్లాలతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన దాదాపు 2లక్షల మంది భక్తులు వచ్చినట్లు మందిర కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆది, మంగళ, బుధవారాల్లో రద్దీ ఎక్కువగా ఉందన్నారు. దీనికి అనుగుణంగా తాగునీటి సౌకర్యాలను మందిర ప్రాంగణంలో ఏర్పాటు చేశామని మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక తెలిపారు.

రూ.1.48 కోట్లతో అభివృద్ధి..

రాష్ట్ర దేవదాయ శాఖ మంజూరు చేసిన రూ.1.48 కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఉత్సవాల సందర్భంగా ప్రారంభించామని రాయిసింగి వెల్లడించారు. మందిరం ప్రాంగణంలో సుమారు రూ.13 లక్షల వ్యయంతో చారిత్రక సతీకుండం అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం రూ.13 లక్షలతో యాత్రికుల నివాస్, రూ.26 లక్షలతో ప్రహరీ, రూ.33 లక్షల వ్యయంతో సిబ్బంది గృహాలు, రూ.33 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించామన్నారు. కొద్ది రోజుల్లోనే మందిరం ప్రాంగణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని వివరించారు.

ఘటాలకు ప్రత్యేక అలంకరణ..

బుధవారం సాయంత్రం ఉత్సవాల ముగింపు కార్యక్రమం ప్రారంభమైంది. మందిరానికి సమీపంలోని మైదానంలో మల్లెలు తొక్కే(నిప్పులపై నడవడం) కార్యక్రమం జరిగింది. మందిరం లోని అమ్మవారి ప్రతిరూపాలుగా రూపుదిద్దుకున్న ఘటాలను పట్టణంలో ఊరేగించిన అనంతరం తిరిగి తీసుకువచ్చారు. అంతకు ముందు ఎర్రగా నిప్పులను(అగ్గి) సిద్ధం చేసి, మందిరం పూజారులు అందులో ప్రవేశించి నడుస్తారు. దీనినే మల్లెలు తొక్కడంగా పిలుస్తారు. ఈ ఘట్టాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ముళ్లతో తయారు చేసిన ఊయలలో పూజారి కూర్చొని ఊగారు. ఈ ఘట్టాల అనంతరం ఉత్సవాలు అధికారికంగా ముగిశాయి. అలాగే ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు అమ్మవారి ప్రతీకగా నిలిచే ఘటాలను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రీతికరమైన మరమరాలు, పానకం రవ్వతో తయారు చేసే కక్కరాలను నైవేద్యాలుగా సమర్పించారు. ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.


సతీకుండం ప్రారంభిస్తున్న ట్రస్టీ బిడిక


అగ్నిపూజకు ఏర్పాట్లు చేస్తున్న మందిరం పూజారులు


పూజలందుకుంటున్న ఘటాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మే 1నుంచి ఓబీసీ సర్వే

- ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి

భువనేశ్వర్: రాష్ట్రంలో మే 1నుంచి వెనుకబడిన తరగతుల(ఓబీసీ) సర్వే ప్రారంభం కానుంది. ఇది అదే నెల 20తో ముగుస్తుంది. అనంతరం వారం రోజులు 27వరకు స్పెషల్ డ్రైవ్ చేపడతారు. రెండు విడతల్లో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ సర్వే నిర్వహిస్తారు. ఓఎస్ సీబీసీ, ఓబీ కమిషన్ వెబ్‌సైట్‌లో సర్వే ప్రక్రియ వివరాలు పొందుపరిచారు. ఈ సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ సర్వే కోసం గ్రామాలు, వార్డుల్లో ఎన్యూమరేటర్ కేంద్రాలను ప్రారంభించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల ప్రాంగణంలో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఆఫ్‌లైన్ సర్వేలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులను ఇందులో నియమిస్తారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మండలస్థాయి ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారు. కుటుంబ పెద్ద లేదా సభ్యులు ఎన్యూమరేటర్ కేంద్రానికి వెళ్లి కుటుంబ సభ్యులందరి వివరాలను తెలియజేసి, నమోదు చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్, ఓటరు కార్డ్, పాన్‌కార్డ్ లేదా పాస్‌పోర్ట్ చూపించవచ్చు. అభ్యర్థి స్వీయ డిక్లరేషన్ ప్రకారం మొత్తం డేటా నమోదు చేస్తారు. సాక్షి సమక్షంలో నమోదు ప్రక్రియ చేపడతారు. జిల్లా, మున్సిపాలిటీల వారీగా కేంద్రాలు తెరుస్తారు. ఈ కేంద్రాలు నిత్యం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి పని చేస్తాయి.

రెండేళ్లు ఆలస్యంగా..

నగరంలో 101 కేంద్రాల్లో సర్వే నిర్వహించనున్నట్లు స్థానిక నగరపాలక సంస్థ(బీఎంసీ) అదనపు కమిషనర్ లక్ష్మీకాంత్ సెఠి బుధవారం తెలిపారు. సర్వే నేపథ్యంలో మొత్తం 208రకాల వర్గాలను వెనుకబడిన వర్గాలుగా గుర్తించారు. ఈ జాబితా కమిషన్ వెబ్‌సైట్‌లో ప్రచురించడంతోపాటు అనుబంధ కేంద్రంలో బహిరంగంగా ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. మే 1నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సర్వేలు ప్రారంభమవుతాయన్నారు ఆఫ్‌లైన్ సర్వే కోసం పట్టణ ప్రాంతాల్లో మాస్టర్ ట్రైనర్ల శిక్షణ బుధవారంతో పూర్తి కాగా, రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వీరు ఎన్యూమరేటర్లకు శిక్షణ కల్పిస్తారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో కిట్‌లు పంపిణీ చేస్తారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్‌లకు ఈనెల 6 నుంచి 13వరకు తొలి విడత, 18 నుంచి 24వరకు మలివిడత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. వాస్తవానికి వెనుకబడిన తరగతుల(ఓబీసీ) సర్వే ప్రక్రియ 2021లో ప్రారంభించారు. కోవిడ్ తాండవంతో ఈ ప్రక్రియ వాయిదా పడింది.

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడి మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బీరుపాడు పంచాయతీ దబ్బలగూడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పువ్వల శ్రీహరి(35) అనే గిరిజనుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. నెల్లికిక్కువ పంచాయతీ వాడపుట్టి గ్రామానికి చెందిన పలువురు ఒడిశా రాష్ట్రం రాయగడలోని మజ్జిగౌరీ దేవిని దర్శించుకునేందుకు బుధవారం పికప్ వాహనంలో బయల్దేరారు. దబ్బలగూడ గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న లోతైన ప్రదేశంలో బొల్తా పడింది. ఈ ఘటనలో శ్రీహరి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను వైద్యం నిమిత్తం రాయగడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్విన్‌పేట పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య సాంపలమ్మ, ఇరువురు పిల్లలున్నారు.

తల్లీబిడ్డపై నలుగురు దాడి

విజయనగరం క్రైమ్: కొడుకుని తిడితే తల్లి అడిగిందని నలుగురు వ్యక్తులు తల్లీకొడుకులిద్దరినీ చితకబాదేశారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కొత్త అగ్రహారానికి చెందిన ఎస్.ఆదిలక్ష్మి అనే మహిళ తన కుమారుడ్ని ఎందుకు కొట్టారని శాంతి నగర్ వెళ్లి కొందరు వ్యక్తులను ప్రశ్నించింది. దీంతో మాటామాట పెరగడంతో తల్లీకొడుకులపై నలుగురు వ్యక్తులు దాడి చేసి చితకబాదారు. దీంతో ఆమె వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వెంకటరావు తెలిపారు.

ఆక్రమణలో డీసీఎంఎస్ స్థలం


డీసీఎంఎస్ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని 9వ వార్డులో ఉన్న డీసీఎంఎస్ స్థలంలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు అందడంతో డీటీ బుచ్చయ్య స్థలం వద్దకు బుధవారం వెళ్లి పరిశీలించారు. నిర్మాణాలు తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ స్థలం రైతు బజారు నిర్మాణం కోసం కేటాయించారని వివరించారు. రెండు రోజుల్లోగా అక్రమ కట్టడాలను తొలగించాలని లేకుంటే తామే వాటిని తొలగిస్తామని ఆక్రమణదారులకు హెచ్చరించారు.

కస్టడీలో యువకుడి మృతి

- బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి
- ప్రభుత్వాన్ని ఆదేశించిన రాష్ట్ర హైకోర్టు

భువనేశ్వర్: కొరాపుట్ జిల్లాలో పోలీసు కస్టడీలో మరణించిన యువకుడి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక పరిహారం చెల్లించాలని ఒడిశా హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జయపురం టౌన్ ఠాణా పోలీసుల చిత్రవధతో నిందితుడు ఆకాష్ మహారియా మృతిచెందాడు. 2017జనవరి 30న జయపురం గాంధీ ఛక్ నుంచి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. అనేక క్రిమినల్ కేసులను ఎదుర్కొన్న ఆయనను.. పోలీసులు చిత్రహింసలకు గురిచేసినట్లు ఆరోపణలు వెలుగు చూశాయి. టౌన్ పోలీస్ స్టేషన్ కస్టడీలో ఉండగా పోలీసుల వేధింపులతో ఆకాష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ పరిస్థితుల్లో చికిత్స కోసం మరుసటి రోజు జయపురం సబ్ డివిజనల్ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అక్కడే గురువారం ఉదయం నిందితుడు మృతి చెందాడు. దీనిపై మృతుడి తల్లిదండ్రులు ప్రదీప్‌కుమార్ మహారియా, ప్రబీనా మహారియా దాఖలు చేసిన ఫిర్యాదును స్థానిక పోలీసులు నిరాకరించారు. తమ కుమారుడు కస్టడీలో వేధింపులకు గురయ్యాడని ఆరోపిస్తూ న్యాయం చేయాలని ఒడిశా మానవ హక్కుల కమిషన్(ఓహెచ్‌ఆర్‌సీ)ని ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కమిషన్ కేసుపై దర్యాప్తు చేయాలని క్రైమ్ బ్రాంచ్(సీబీ)ని ఆదేశించింది. కేసు విచారణను క్రైంశాఖ తరచూ వాయిదా వేయడంతో బాధిత వర్గం హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. క్రైంశాఖ దర్యాప్తులో చిత్తశుద్ధి లేనట్లు భావించింది. మృతుడి వైద్య నివేదిక ఆధారంగా ఆర్థిక నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

బ్యాంకు దోపిడీకి యత్నించిన నిందితుడి అరెస్టు

విజయనగరం క్రైమ్: బ్యాంకు దోపిడికి ప్రయత్నించిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ ఎస్ఐ షేక్ శంకర్ బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక దాసన్నపేట ఎస్‌బీఐ బజార్ రోడ్డు బ్రాంచ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మార్చి 31న బ్యాంక్ షట్టర్ పగలగొట్టి లోపలికి ప్రవేశించి లాకర్‌ను తెరించేందుకు ప్రయత్నించి విఫలమై వెనుదిరిగారు. మరుసటి రోజు గుర్తించిన ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ నేరంపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీసీటీవీ పుటేజ్, క్లూస్ టీం రంగంలోకి దిగి పలు ఆధారాలు సేకరించింది. జామి మండలం అన్నంరాజుపేట గ్రామానికి చెందిన కంటుభుక్త మధు అనే పాత నేరస్తుడిగా గుర్తించారు. ప్రస్తుతం విశాఖలో ఉంటున్నట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఎస్ఐకి వచ్చిన కచ్చితమైన సమాచారంతో సిబ్బందితో కలిసి దాసన్నపేట జంక్షన్ వద్ద నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఎస్‌బీఐ బ్రాంచ్‌తో పాటూ కొత్తవలస ఏటీఎం కూడా చోరీకి ప్రయత్నం చేసి విఫలమైనట్లు, పెందుర్తి పోలీసుస్టేషన్‌లో మూడు, ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు తనపై ఉన్నట్లు అంగీకరించాడు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ ఎస్ఐ షేక్ శంకర్ (వెనుక ముసుగులో నిందితుడు)

నేలకు నవ వసంతం

భూసారం పెంచేందుకు ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తల తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రకృతి వ్యవసాయం వైపు రైతాంగం దృష్టి మళ్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. ఆశించిన ఫలితాలు సాధిస్తున్నారు.

- నవ ధాన్యాల సాగుతో భూమి సారవంతం
- రసాయనిక ఎరువులను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రణాళిక
- జిల్లాలో లక్షా 5 వేల 272 ఎకరాల్లో సాగు లక్ష్యం
- పంటతో బహుళ ప్రయోజనాలు


నవధాన్యాల విత్తనాలు

సీతంపేట: భూసారం పెంచడానికి, నేల తల్లి ఆరోగ్యం కాపాడి జీవం పోయడానికి నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ దిశగా రైతులను చైతన్యం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. రసాయనిక ఎరువులు వాడకంతో భూముల సారం కోల్పోయాయి. ఈ పరిస్థితుల్లో రేపటి తరానికి మంచి భూములను అందించాలన్న సదాశయంతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుంది. గ్రామ, గ్రామాన రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

లక్షా 5 వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక

ఈ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ అనంతరం ఖాళీగా ఉన్న పంట చేలల్లో పచ్చి రొట్ట బదులు నవధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారు. 2023 – 24 సంవత్సరంలో జిల్లాలో 15 మండలాల్లో 50,782 మంది రైతులు లక్షా 5 వేల 272 ఎకరాల్లో నవధాన్యాల సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆయా మండలాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇప్పటికే రైతుల నుంచి ఆమోదం తీసుకుని విత్తన గుళికలు తయారు చేసి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవధాన్యాలతో పాటు 32 రకాల విత్తనాలు వీటిలో ధాన్యం, పప్పు, నూనె, పచ్చిరొట్ట సుగంధ ద్రవాలు కలిసి ఉంటాయి. మొక్కజొన్న, జొన్న, మినుములు, పెసలు, ఉలవలు, చోడి, జిలుగు, జనుము, గోంగూర, తోటకూర, కొత్తిమీర, బీర, ఆనప, ఊదలు, కొర్రలు తదితర విత్తనాలు నవధాన్యాలుగా పంట పొలాల్లో చల్లుతారు. 12 కిలోల విత్తన గుళికలను బంక మట్టితో కలిపి వాటి పరిమాణాన్ని రెండున్నర రెట్లుగా పెంచుతారు.


నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

దీనికి ఘన జీవామృతాన్ని జోడించి రైతులకు అందజేస్తారు. విత్తన గుళికలు తయారీతో ఆ విత్తనాలను పక్షులు తినే వీలు లేకుండా ఉంటుంది. చల్లిన ప్రతీ గింజ మొలకెత్తుతాయి.

పశువులకు మేతగా...

40 నుంచి 45 రోజుల పాటు ఏపుగా ఎదిగే నవధాన్యాలపై పంట పశువులకు మేతగా రైతులు కోసుకుని లబ్ధి పొందుతారు. బలవర్ధక పౌష్టికాహారం పశువులకు అందుతుంది. దీంతో పాడి లాభసాటిగా, పశువులు ఆరోగ్యంగా ఉండటంతో రైతులకు రెండు రకాలుగా మేలు జరుగుతుంది. భూమిలోకి వెళ్లిన వేళ్ల రైతులు కోసివేయగా మిగిలిన నవధాన్యాల దుబ్బులు భూమిలో ట్రాక్టర్‌లతో కలియ దున్నుతారు. దీంతో భూమి గుల్లబారి, నీటి నిల్వ సామర్థ్యం పెరిగి సూక్ష్మపోషకాలు భూమిలో వృద్ధి చెంది ఖరీఫ్ పంటకు జవసత్వాలు రెట్టింపవుతాయి.

బీజామృతం తయారీ ఇలా...

దేశీ ఆవుపేడను పలచటి గుడ్డలో మూటకట్టి 20 లీటర్ల నీరు ఉన్న తొట్టెలో 12 గంటలు ఉంచాలి. ఒక లీటరు నీటిని వేరే పాత్రలో తీసుకుని 50 గ్రాముల సున్నం కలిపి రాత్రంతా ఉంచి ఉదయాన్నే నానబెట్టిన పేడ మూటను చేతితో పిండి రసాన్ని నీటి తొట్టెలో కలపాలి. పుట్ట మందును పేడ నీరు ఉన్న తొట్టెలో వేసి కర్రతో తిప్పాలి. 12 గంటల పాటు నిల్వ ఉంచి మరునాడు విత్తనాలకు పట్టించి నీడలో ఆరబెట్టి నాటితే ఏ రకమైన చీడపీడలు రాకుండా విత్తనాలు మొలకెత్తుతాయి. వీటిపై ప్రకృతి వ్యవసాయం అధికారులు రైతులను చైతన్యం చేస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



గ్రామసభలు ఏర్పాటు చేసి వీవో, ఎస్‌హెచ్‌జీలు, ఆర్‌బీకేల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. తొలకరి వర్షాలకు రైతులు నవధాన్య విత్తన గుళికలు పంట పొలాల్లో చల్లడం ద్వారా పచ్చిరొట్ట తయారౌతుంది. 40 రోజుల్లో మొలకెత్తిన పంట ఏపుగా పెరిగి, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. అలాగే భూమి సారవంతమౌతుంది.

– పి.షణ్ముకరాజు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయం

ఎరువుల వాడకం తగ్గుతుంది



నవ ధాన్యాలు వేయడం వలన ఎరువుల వాడకం తగ్గుతుంది. గత సంవత్సరం మంచి ఫలితాలు వచ్చాయి. మొక్కలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఘన, ద్రవ జీవామృతాలు వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

– ధనుంజయరావు, అడిషనల్ డీపీఎం, ప్రకృతి వ్యవసాయం

తుప్పల్లోకి దూసుకుపోయిన లారీ


అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో తుప్పల్లోకి దూసుకుపోయిన లారీ

కొత్తవలస : మండలంలోని కొత్తవలస - విజయనగరం రోడ్డులో అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున లారీ తుప్పల్లోకి దూసుకుపోయింది. స్థానికులు అందించిన వివరాలు.. విశాఖపట్నం నుంచి నూతనంగా నిర్మిస్తున్న రాయపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి తెల్ల బూడిద లోడ్‌తో చిన్నిపాలెం సమీపంలోకి వెళ్తుండగా అర్ధన్నపాలెం సమీపంలోకి వచ్చే సరికి అదుపు తప్పి రోడ్డు పక్కన తుప్పల్లోకి దూసుకుపోయింది. డ్రైవర్ నిద్రమత్తులో వుండడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు వారు తెలిపారు.

న్యూస్‌రీల్

అక్రమ క్వారీలను సీజ్ చేయండి



అధికారులకు ఆదేశాలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: వీఆర్‌గూడెం కొండపై అక్రమ మైనింగ్ వ్యవహారం బయటపెట్టే ప్రయత్నం చేసిన విద్యార్థి బగాది మణికంఠను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. విద్యార్థి మృతి చెందిన గ్రావెల్ మైనింగ్ ప్రాంతాన్ని బుధవారం మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. అనుమతి లేకుండా ఇంత భారీగా మైనింగ్ జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మైనింగ్ మాఫియాను విడిచిపెట్టేది లేదన్నారు. రెండు రోజుల్లో అక్రమ మైనింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని మైనింగ్ డీడీ ఫణిభూషణ్‌ను ఆదేశించారు. ఈ విషయంలో సీబీ, సీఐడీ విచారణ జరిపించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతానన్నారు. అక్రమ మైనింగ్ నిర్వాహకులు సువ్వారి మధుసూదనరావు, చోళ్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారని తెలిసిందని, ఈ హత్యకు కారణమైనవారిని, వారిని వెనుక ఉండి నడిపించిన వారిని విడిచి పెట్టవద్దని అధికారులకు ఆదేశించారు. మైనింగ్ డీడీ మాట్లాడుతూ రెవెన్యూ, మైనింగ్‌శాఖల ఆధ్వర్యంలో విచారణ చేస్తామన్నారు. విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపీపీ కిల్లి ఉషారాణి, మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ సీఐకి సేవా పతకం



బెల్లుకోల హరి

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం అవినీతి నిరోధక శాఖ విభాగంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బెల్లుకోల హరికి తెలుగువారి కొత్త సంవత్సరం ఉగాది-2023 పురస్కారాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ సేవా పతాకం లభించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడినట్లు సీఐ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2010లో సబ్ ఇన్‌స్పెక్టర్ పోలీసుగా విధుల్లో చేరిన ఈయన 2018లో ఉద్యోగోన్నతి ద్వారా ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయ్యారు.

ఆర్‌పీఎఫ్ బ్యారక్ ప్రారంభం



బ్యారక్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పాతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌ను బుధవారం రైల్వే డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పాతి సందర్శించారు. తొలుత స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్‌పీఎఫ్ బ్యారక్‌ను ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. అధికారులకు సూచనలు అందించారు. స్టేషన్‌లో మౌలిక వసతులు, అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను అధికారులు డీఆర్‌ఎం దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్పీ చొక్కా రఘువీర్, సీనియర్ డీసీఎం అఖిలేష్‌కుమార్ త్రిపాఠి, ఏఈఎన్ ఎం.వి.రమణ, ఆర్‌పీఎఫ్ ఓసీ మనోజ్‌కుమార్, ఎస్‌ఎం ఎం.రవి, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

20 నుంచి కూర్మలో వైదిక వృత్తి శిక్షణ

హిరమండలం: కిట్టాలపాడు పంచయతీ పరిధిలోని కూర్మ గ్రామంలో ఈ నెల 20 నుంచి మే 4 వరకు వైదిక వృత్తి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి సంరక్షణ, హిందూ సంప్రదాయాలు, జీవన విధానాలు, మానవ మనుగడకు కావల్సిన అంశాలపై ప్రత్యేక శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల వయసున్న వారు పాల్గొనవచ్చని, ముందుగా నిర్వాహకులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వక్ఫ్‌బోర్డు భూములపై సర్వే



కస్పావీధి మసీదు భూముల రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములు, స్థలాలపై అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. కస్పావీధి మసీదు పరిసరాలు, గవర్నమెంట్ ఆస్పత్రి రోడ్డు, మెయిన్ రోడ్డు, పట్టణ పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో ఉన్న ఆస్తులను కూడా పరిశీలించారు. వీటిలో కొన్ని ఆక్రమణకు గురైనట్టు గుర్తించామని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ అబ్దుల్ సాదిఖ్ షేక్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యులు రియాజ్ ఖాన్‌లు తెలిపారు. పూర్తి నివేదికను సిద్ధం చేసి అధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. సర్వేయర్లు హనుమంతు, శివ, ముస్లిం పెద్ద జోహార్‌ఖాన్ పాల్గొన్నారు.

పెచ్చరిల్లుతున్న పచ్చ ప్రకోపం



పచ్చ ప్రకోపం పెచ్చరిల్లుతోంది. పచ్చ రౌడీలు రెచ్చిపోతున్నారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. తమ దౌర్జన్యాలు, దోపిడీలు ఆగవని పచ్చ బ్యాచ్ తెగేసి చెబుతోంది. అరాచకాలకు తెగబడుతోంది. ఐదు రోజుల వ్యవధిలో జరిగిన రెండు ఘటనలు తెలుగుదేశం నేతల గుండాగిరీకి, అక్రమ దందాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పొందూరు మండలంలో కూన రవికుమార్ అనుచరులు నిర్వహిస్తున్న అక్రమ క్వారీలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మరణిస్తే దాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురంలో ప్రభుత్వ సాయంతో పేదలు కట్టుకుంటున్న ఇళ్లను అచ్చెన్నాయుడు అనుచరుడైన వసంతరావు తదితరులు ప్రొక్లెయినర్‌తో కూల్చివేశారు.

- అక్రమాలను అడ్డుకుంటే దౌర్జన్యాలు
- ఐదు రోజుల వ్యవధిలో రెండు ఘటనలు
- పొందూరు మండలంలో అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న కూన రవి అండ్ కో
- క్వారీలో యువకుడి అనుమానాస్పద మృతి
- సంతబొమ్మాళి మండలంలో పేదల ఇళ్లను కూల్చేసిన అచ్చెన్న వర్గీయులు



పొందూరు మండలం వీఆర్‌గూడెం కొండపై సర్వే నంబర్ 137లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అనుచరులు, బినామీలైన సువ్వారి మధుసూదనరావు, చోళ్ల శ్రీనివాసరావు అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్వారీలో 20 ఏళ్ల యువకుడు బగాది మణికంఠ అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఆయన తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే చనిపోయాడు. అక్రమ మైనింగ్ వ్యవహారం, మృతి గల కారణాలు ఎక్కడ బయటకు తెలిసిపోతాయోనన్న ఉద్దేశంతో అక్కడికి కిలోమీటరన్నర దూరంలోని రోడ్డు వద్దకు మృతదేహాన్ని తీసుకెళ్లి, అక్కడే లారీ ఉంచి, దానికింద మృతదేహాన్ని పెట్టి ప్రమాదవశాత్తు మృతి చెందాడని సీన్ క్రియేట్ చేశారు.

సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురంలో సర్వే నంబర్ 214-3సీలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అనుచరుడు టీడీపీ నాయకుడు ఆరంగి వసంతరావు ఆక్రమించుకున్న 23 సెంట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఇళ్లు లేని ఏడుగురు నిరుపేదలకు జగనన్న ఇళ్ల పట్టాలిచ్చారు. దాంట్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మాణం చేసుకుంటుంటే ఆక్రమిత టీడీపీ నాయకుడు వసంతరావు, తదితరులు దౌర్జన్యానికి దిగారు. సోమవారం అర్ధరాత్రి దాటిన ఇళ్లను ప్రొక్లెయినర్‌తో కూల్చేశారు.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఈ రెండు ఘటనలు ఐదు రోజుల వ్యవధిలోనే జరిగాయి. రెండింటిలోనూ టీడీపీ నాయకుల దౌర్జన్యం, దుశ్చర్య, అక్రమ వ్యవహారాలే దాగి ఉన్నాయి. అధికారం లేకపోయినా పచ్చనేతల తీరు మారలేదు. తిరిగి ఎదురు దాడికి దిగుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటే కక్ష సాధింపు అని గగ్గోలు పెడుతున్నారు.

ఎవరికి తెలియని కూన రవి లీలలు..

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ వ్యవహారం జిల్లా ప్రజలందరికీ తెలిసిందే. అధికారంలో ఉన్నంతకాలం ఇసుక మాఫియా నడిపారు. వంశధార నదిలో ఇసుకను దోచేశారు. అడ్డొచ్చే వాళ్లపై దౌర్జన్యం చేశారు. ఆ సమయంలో ఉద్యోగులు, అధికారులు సైతం మైనింగ్‌ను అడ్డుకునేందుకు సాహసించలేదంటే ఎంత అరాచకంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు. టెక్కలిలోని లింగాలవలస, అడ్డుకొండ ప్రాంతాల్లో కూడా అక్రమ మైనింగ్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. భూకబ్జాల బాగోతం ఉంది. ఇవన్నీ టీడీపీ అధికారంలో ఉండగా జిల్లా ప్రజలు చూసినవే. ఇక, వారి సొంత కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధ్వర్యంలో అనేకఅక్రమాలకు పాల్పడ్డారు. రోడ్లు, నీరు చెట్టు పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి చేశారు. వాళ్ల చేతివాటం కారణంగా ఇప్పటికీ నాసిరకం నిర్మాణాలు కళ్లముందు కన్పిస్తూనే ఉన్నాయి. అధికారం పోయాక కూడా ఆయన దౌర్జన్యాలు ఆగలేదు. ఎంతోమందిని బెదిరింపు, దుర్భాష, దౌర్జన్యానికి దిగిన సంఘటనలు ఉన్నా యి. ఇప్పటికే అనేక కేసులు నమోదయ్యాయి. అరెస్టై బెయిల్‌పై బయట ఉన్న పరిస్థితి ఉంది. అయినా వెనక్కి తగ్గడం లేదు. తప్పు చేయడం .. కోర్టుకెళ్లి బెయిల్ తెచ్చుకోవడం, లేదంటే సాంకేతిక కారణాలు చూపించి కేసుల నుంచి తప్పించుకోవడం చేస్తూనే ఉన్నారు. ఏం చేసినా తమనెవరూ ఏమీ చేయలేరన్న అహంకారంతో వ్యవహరిస్తున్నారు.



అచ్చెన్న ఇలాకాలోనూ..

ఇక, అచ్చెన్నాయుడు నియోజకవర్గంలోని సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురంలో ఇదే రకమైన అరాచకం జరిగింది. అచ్చెన్న అండతో అనుచర గణం జగనన్న ఇళ్ల స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రి కూల్చేసి భయానక వాతావరణం సృష్టించారు. ఆక్రమణకు గురైన 23 సెంట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, పేదలకు ఇచ్చిందన్న అక్కసుతో అచ్చెన్న అనుచరులు ఆరంగి వసంతరావు తదితరులు పేదల ఇళ్లను ప్రొక్లెయినర్‌తో కూల్చేశారు. కేసులు నమోదైతే కోర్టుకెళ్లి స్టేలు తెచ్చుకోవచ్చు..లేదంటే బెయిలైనా తెచ్చుకోవచ్చన్న ధీమాతో బరితెగించేస్తున్నారు.

ప్రమాదం జరిగిన చోట అక్రమ మైనింగ్..

తాజాగా తన నియోజకవర్గ పరిధిలోని పొందూరు మండలం వీఆర్ గూడెంలో కూన రవికుమార్, తన సతీమణి కూన ప్రమీల, సింహాచలం, చింతాడ కృష్ణవాసుదేవరావు తదితరుల పార్టనర్లుగా ఉన్న గణేష్ స్టోన్‌క్రషర్ పేరుతో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. దాని పక్కనే ఆయన అనుచరులు కూడా అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారు. ఇక్కడే అనుమానస్పదంగా ఆ క్వారీలో పనిచేసిన బగాది మణికంఠ యువకుడు మృతి చెందాడు. వీరి వ్యవహారాలన్నీ బయట పెట్టేస్తారన్న అభద్రతాభావంతోనే మణికంఠ అనే యువకుడిని లారీతో తొక్కి, చంపేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటికి తగ్గట్టుగానే యువకుడు క్వారీ వద్ద చనిపోతే.. అక్కడికి కిలోమీటరన్నర దూరంలో మృతదేహాన్ని తీసుకొచ్చి అదే లారీ కింద పెట్టి ప్రమాదం జరిగినట్టుగా చిత్రీకరించారు. దీన్ని బట్టి మణికంఠను హత్య చేశారన్న వాదనలు బలపడ్డాయి. వారికి సంబంధం లేకపోయి ఉంటే ఈపాటికే ఎంత రచ్చ చేసేసేవారో. అవసరమైతే చంద్రబాబును తీసుకొచ్చేసి, తమకున్న ఎల్లోమీడియా ద్వారా ప్రచారం చేసేసి, నానా హంగామా చేసేవారు. తప్పు వారివైపు ఉండటంతో తేలు కుట్టిన దొంగల్లా ఉన్నారు.



ప్రమాదం జరిగిన కిలోమీటరన్నర దూరంలోని రోడ్డుపై లారీ కింద మృతదేహాన్ని పెట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన దృశ్యం

● పుష్పకాంతుల్లో ఆదిత్యుడు



ప్రత్యక్ష దైవం అరసవల్లి ఆదిత్యాలయంలో వార్షిక కల్యాణోత్సవాల ముగింపు ప్రక్రియలో ప్రధానమైన పుష్పయాగ మహోత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. అనివెట్టి మండపంలో సుమారు 12రకాల పుష్పాలతో స్వామి ఉత్స వమూర్తుల వద్ద అమర్చగా.. పుష్పకాంతుల్లో ఆది త్యుని ఉత్సవ మూర్తులు వెలిగిపోయారు. ప్రత్యేక అర్చనల అనంతరం భక్తి గీతాలాపానతో ఏకాంతసేవ నిర్వహించారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. - అరసవల్లి

గురుకులాల్లో సీసీ కెమెరాలు



శ్రీకాకుళం పాతబస్టాండ్ : డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులాల్లో విద్యార్థుల భద్రతకు పెద్దపీట వేస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గురుకులాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా కోసం సోలార్ ప్యానళ్లు సైతం సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని గురుకులాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో తొమ్మిది గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగిలిన చోట్లా సుమారు వంద వరకు సీసీ కెమెరాల అవసరం ఉంది. ఈ విషయమై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల జిల్లా కన్వీనర్ గేస్ మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరం నాటికి అన్ని గదుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. జిల్లాకు సుమారు వంద సీసీ కెమెరాలు అవసరమవుతాయని పేర్కొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

టెక్కలి: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి వైద్యం అందించే విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. రెండు రోజుల క్రితం మందస మండలం హన్నాలి గ్రామానికి చెందిన గర్భిణి దేవకి నాయక్ పురిటి నొప్పులతో ప్రసవం కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి వస్తే.. అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరించి ఆమెను రిఫర్ చేయగా మార్గం మధ్యలో 108 సిబ్బంది ఆమెకు వైద్య సేవలు అందజేసి ప్రసవం చేయించారు. ఈ ఘటనపై 'గర్భిణికి చుక్కలు చూపించారు' అనే కథనం సాక్షిలో వెలువడటంతో పాటు మిగిలిన పత్రికల్లో వేర్వేరు కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో బుధవారం టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావుతో పాటు ఘటన జరిగిన రోజున విధుల్లో ఉన్న వైద్య, నర్సింగ్ సిబ్బందిని సబ్ కలెక్టర్ బుధవారం తన కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. అయితే తాము ఎటువంటి నిర్లక్ష్యం చేయలేదని.. కేవలం 108 సిబ్బంది ఇమేజ్ కోసమే తాము నిర్లక్ష్యం చేశామని ప్రచారం చేశారని వైద్య సిబ్బంది వెల్లడించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రిపై తరచూ విమర్శలు వస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసవం కోసం ఆసుపత్రికి వస్తే వైద్య, నర్సింగ్ సిబ్బంది చేయలేని వైద్యాన్ని 108 సిబ్బంది ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. గర్భిణి విషయంలో జరిగిన ఘటనపై వైద్యాధికారులు, 108 సిబ్బంది, ప్రత్యక్షంగా ఉన్న వారితో విచారణ చేస్తామని, తప్పు జరిగినట్లు తేలితే సంబంధిత సిబ్బందిని సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు.



వైద్య సిబ్బందిని విచారిస్తున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

సాహిత్యంతో సామాజిక చైతన్యం

ఆమదాలవలస: సాహిత్యంతో సామాజిక చైతన్యం చేకూరుతుందని, అందుకు కృషి చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక సేవలు అభినందనీయమని శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ వేదిక జాతీయ మీడియా ప్రతినిధి బమ్మిడి అమ్మోజీ గురువారం స్పీకర్‌కు ఆమదాలవలసలోని ఆయన నివాసంలో ఆహ్వాన పత్రం అందించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ, జిల్లా జాయింట్ సెక్రటరీ పిల్లా రామునాయుడు, వర్ధమాన రచయిత్రి కావ్య పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

● మందారం..ద్వివర్ణ శోభితం



ఎల్.ఎన్.పేట మండలం తురకపేట సెంటర్‌కు చెందిన మూల రాధిక తన ఇంటి ప్రాంగణంలో నాటిన ఓ మందారం మొక్క ఒకే పువ్వు రెండు రంగులతో చూపరులను ఆకట్టుకుంటోంది. తొలుత చందనం రంగులో పూలు పూచేవి. ఇప్పుడు రెండు రంగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. - ఎల్.ఎన్.పేట

వెంకటాపురంలో అగ్ని ప్రమాదం

- ఆరు పూరిళ్లు దగ్ధం

లావేరు: వెంకటాపురం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఆరు పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. ఆరు లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. ప్రమాదంలో దేవాడ ఆదినారాయణ, శీల రాము, అదపాక రాము, శీల శివ, అదపాక సత్యం, సతివాడ ఆదినారాయణలకు చెందిన ఇళ్లు బుడిదయ్యాయి. విద్యుత్ మీటర్లు, రేషన్, ఆధార్‌కార్డులు, వంట సామగ్రి, తిండి గింజలు, బట్టలు, నగదు కాలిపోయాయని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాదం రాత్రి వేళ సంభవించడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాద విషయాన్ని స్థానికులు రణస్థలంలోని అగ్నిమాపక కేంద్రానికి తెలియజేయడంతో సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను అదుపుచేశారు. వెంకటాపురం పంచాయతీ సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు బాధితులకు సహాయక చర్యలు చేపట్టారు. వీఆర్వో రాంబాబు బుధవారం బాధితులను పరామర్శించి నష్టం వివరాలు సేకరించారు.



దగ్ధమవుతున్న ఇళ్లు

ఫ్యామిలీ డాక్టర్ రెడీ..!



సింగుపురం పిహెచ్‌సి పరిధిలో ఇంటికే పరిమితమైన రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు (ఫైల్)

- నేటి నుంచి జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు
- 66 పీహెచ్‌సీల పరిధిలో 132 మంది వైద్యులు సిద్ధం
- అందుబాటులో 55 సంచార 104 వాహనాలు
- ఇకపై ప్రతి గ్రామానికి నెలకు రెండు రోజులు వైద్యులు రాక

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం గురువారం నుంచే జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు కానుంది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మార్గదర్శకాల ప్రకారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోనూ ఈకొత్త విధానం పక్కాగా అమలయ్యేలా వైద్యాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ఏడాది అక్టోబర్ 21 నుంచి ట్రయల్ రన్‌గా ఈ విధానాన్ని అమలు చేయగా సత్ఫలితాలు వచ్చాయి. సుమారు 1.50 లక్షల మందికి ప్రత్యక్ష సేవలందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన రోగుల వద్దకు నేరుగా ప్రభుత్వ వైద్యుడే వెళ్లి వారి యోగక్షేమాలను తెలుసుకునే చర్యలు అద్భుత ఫలితాలనిచ్చాయి. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి మొబైల్ మెడికల్ యూనిట్ (104) వాహనాల ద్వారా వైద్యం, మందులు ఇచ్చే ప్రక్రియ కూడా విజయవంతమైంది. దీంతో ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించనుండగా..ఈ వేడుకను లైవ్‌లో చూసిన అనంతరం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ ఆయా ప్రజాప్రతినిధులు ఈ విధానాన్ని ప్రారంభిస్తారు.

66 పీహెచ్‌సిల్లో ఎఫ్‌పీసీ..

జిల్లాలో 30 మండలాల్లో 66 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పరిధిలో 591 విలేజి హెల్త్ క్లినిక్స్ ఉన్నాయి. వీటి పరిధిలోని గ్రామాల్లోనే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) అమలు చేయనున్నారు. ఇందుకోసం కొత్త క్యాడర్ స్ట్రెంత్‌గా 14 మంది సిబ్బందితో పీహెచ్‌సీల్లో వైద్యులతో పాటు సిబ్బంది నియామకాలు పూర్తి చేశారు. 55 ఎంఎంయూ 104 వాహనాల సేవలను ఇందులో భాగస్వామ్యం చేయనున్నారు. గురువారానికి 30 వాహనాల్లోని సిబ్బందిని సన్నద్ధం చేయగా.. మరికొద్ది రోజుల్లో కొత్తగా మంజూరైన 25 వాహనాల సిబ్బంది విధుల్లోకి రానున్నారు. ఇకపై ప్రతి నెలా రెండు సార్లు గ్రామాల్లో ఈ విధానం షెడ్యూల్ ప్రకారం అమలు చేయనున్నారు. ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరేసి చొప్పున 132 మంది వైద్యులు (మెడికల్ ఆఫీసర్లు) ఈ విధానం అమలు కోసం పూర్తిస్థాయిలో నియమించగా, అదనంగా రిజర్వ్‌గా ఉండేలా కొత్తగా మంజూరైన కళ్లేపల్లి (శ్రీకాకుళం రూరల్), లింగాలవలస (టెక్కలి), మెట్టూరు (కొత్తూరు), పురుషోత్తపురం (సరుబుజ్జిలి), తురకపేట (ఎల్ఎన్‌పేట) పీహెచ్‌సీలలోనూ 10 మంది వైద్యులు, వైద్యవిధాన పరిషత్ పరిధిలోని మరో 9 గ్రామీణ ఆస్పత్రుల్లో 9 మంది వైద్యులతో పాటు పూల్ డాక్టర్లుగా మరో నలుగుర్ని నియమించారు. మొత్తంగా ఈ 23 మంది వైద్యులను రిజర్వ్‌లో ఉంచుతూ వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. ఏ కారణంగానైనా మెడికల్ ఆఫీసర్లు సెలవులో ఉంటే రిజర్వ్ డాక్టర్లు ఎఫ్‌పీసీని కొనసాగిస్తారు.

ఫ్యామిలీ డాక్టర్ అమలు ఇలా.....

- ప్రతీ పీహెచ్‌సీ/ వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్‌లకు ఇద్దరేసి వైద్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీరిలో ఒక వైద్యుడు పీహెచ్‌సీలో ఉంటే.. మరో వైద్యుడు నిర్దేశిత గ్రామాలకు 104 వాహనంతో వెళ్లి తనకు కేటాయించిన గ్రామ సచివాలయాల పరిధిలోని కుటుంబాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది.
- ఇలా రోజు మార్చి రోజు ఓ వైద్యుడు పీహెచ్‌సీలో, మరో వైద్యుడు 104 వాహనంలో విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. వైద్య సేవలు ఏ గ్రామంలో జరుగుతాయో సచివాలయాల వద్ద ప్రదర్శిస్తారు.
- గ్రామాల్లో ఏ కుటుంబంలోనైనా చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా...వెంటనే ఈ ఫ్యామిలీ డాక్టర్‌ను సంప్రదించాలనేదే కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.
- 104 వాహనం వద్ద 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంచుతారు. కౌమార బాలికలకు పరీక్షలు, గర్భిణులకు యాంటీనేటల్ కేర్ పరీక్షలు (ఏఎన్‌సీ), బాలింతలకు ఆరోగ్య పరీక్షలు (పీఎన్‌సీ), రక్తహీనత పరీక్షలు (ఎనీమియా), రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, టీబీ (క్షయ) తదితర పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారు.

గ్రామీణ రోగులకు వరం..



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైద్యుడు సేవలందించడం నిజంగా అద్భుతమనే చెప్పాలి. గత ఏడాది అక్టోబర్ 21 నుంచి మొత్తం 30 మండలాల్లో ట్రయల్ రన్ నిర్వహించాం. 14 రకాల పరీక్షలు, 67 రకాల మందుల పంపిణీ తదితర సేవలను సుమారు లక్షన్నర మందికి అందేలా చేశా. ఇప్పుడు పూర్తి స్థాయిలో గురువారం నుంచి ఈ విధానం అమలు చేయనున్నాం.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

పూర్తి పర్యవేక్షణలోనే..



వైద్యులందరికీ పక్కాగా నిబంధనలు తెలియజేశాం. ప్రతి గ్రామానికి 104 వాహనం నెలలో రెండు సార్లు వెళ్లాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలందించాలి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓ.పి సేవలు, తర్వాత వైద్యుడు, ఆశావర్కర్, ఎఎన్ఎం, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ బృందంగా ఇంటిలో మంచానికే పరిమితమైన రోగులను పరీక్షించాలి. ప్రతి సేవపై పర్యవేక్షణ ఉంటుంది.

– డాక్టర్ లక్ష్మి తులసి, ఎఫ్‌పీసీ నోడల్ ఆఫీసర్